



కారులోనే మృతి చెందిన దువ్వారి మీనమ్మ, కుమారుడు లక్ష్మీపతి

పుట్టినరోజు వేడుకకు వెళ్తూ..

- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు
- బుడుమూరు వద్ద ఘటన
- పాతపట్నం మండలం పెదలోగిడిలో విషాదం

మరో గంటలో గమ్యస్థానం చేరుకునేవారు. మురుసటి రోజు శుభకార్యం ఆనందంగా జరుపుకునేవారు. ఆలోపే ఒకే కుటుంబంలో ముగ్గురిని మృత్యువు కబళించింది. కారు టైరు పేలి.. అదుపుతప్పి.. ద్విచక్ర వాహనదారుడిని, ఆవెంటనే లారీని ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగిపోయింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు కూడా మృతి చెందాడు. బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.





నుజ్జునుజ్జయిన కారు, స్కూటీ

శ్రీకాకుళం/ లావేరు/ పాతపట్నం, మార్చి 15(ఆంధ్రజ్యోతి):

లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పాతపట్నం మండలం పెదలోగిడి గ్రామానికి చెందిన దువ్వారి మీనాక్షి(60), ఆమె కుమారుడు లక్ష్మణరావు(28), అల్లుడు ఉగ్రిపల్లి భాస్కరరావు (40)తోపాటు విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మద్దూరి శంకరంపేటకు తోలాపు శంకరరావు(34) ప్రాణాలు కోల్పోయారు. పెదలోగిడి గ్రామానికి చెందిన దువ్వారి కాళిదాసుది వ్యవసాయ కుటుంబం. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు సంతు విశాఖపట్నం జిల్లా మధురవాడలో ఉంటున్నాడు. పెద్దకుమారుడి ఇంట్లో మనువడి పుట్టినరోజు వేడుక జరగనుంది. ఈ వేడుకకు ముందస్తుగా వెళ్లి ఏర్పాట్లు చూసుకునేందుకుగాను శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కాళిదాసు కుటుంబ సభ్యులు బయలు దేరారు. కాళిదాసు, అతని భార్య (మిగతా 8వ పేజీలో..)



మీనాక్షి (ఫైల్)



లక్ష్మణరావు (ఫైల్)



భాస్కరరావు(ఫైల్)



శంకరరావు (ఫైల్)

● స్కూటీపై వెళ్తూ.. మృత్యుఒడికి..

సంతకవిటి మండలం మద్దూరి శంకరం పేటకు చెందిన టి.శంకరరావు రణస్థలం మండలంలో బీరు కంపెనీలో పనిచేస్తున్నాడు. బంటుపల్లి గ్రామంలో అద్దె ఇంటిలో నివసిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. శంకరరావు తన స్కూటీపై ఎప్పటిలానే వెళ్తుండగా.. వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొని మృత్యుఒడికి చేరారు.

ఫోన్ చేసిన కొన్ని గంటల్లోనే..

ఇదిలా ఉండగా శనివారం బయలుదేరే ముందు మీనాక్షి.. మధురవాడలో ఉంటున్న తన కుమారుడి సంతుకి ఫోన్ చేసింది. 'నాన్నా మీ ఇంటికి బయలుదేరాం. మనవడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా చేసుకుందాం. కొన్ని గంటల్లోనే వచ్చేస్తాం' అని చెప్పింది. ఇంతలోనే ఊహించని విధంగా కొన్ని గంటల్లోనే జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి సేకరించిన భూమి

మళ్లీ.. అణు కదలిక

- కొవ్వాడ విద్యుత్ ప్లాంటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- సీఎం చంద్రబాబుతో చర్చించిన ప్రధాని మోదీ
- శాసనసభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్
- ప్రత్యేక ప్రకటన చేసిన ముఖ్యమంత్రి
- సమస్యలు పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి

● కొవ్వాడలో అణు విద్యుత్‌ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటు సందిగ్ధంలో ఉంది. కొవ్వాడ పంచాయతీలో మత్స్యకారులు తమ భూములను ప్లాంట్ కోసం వదులుకున్నారు. ఆస్తులను త్యాగం చేశారు. కానీ అక్కడ పరిశ్రమ ఏర్పాటుకు అడుగు ముందుకు పడడంలేదు. అక్కడ ప్లాంటు ఏర్పాటైతే మత్స్యకారులతోపాటు స్థానికులకు జీవనోపాధి పెరుగుతుంది. దీనిపై ప్రభుత్వం స్పందించి మత్స్యకారులకు నష్ట పరిహారంతోపాటు ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- ఇదీ ఇటీవల శాసనసభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు చేసిన విన్నపం

● విద్యుత్ పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుంది. శ్రీకాకుళం జిల్లాలో కొవ్వాడ అణు విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సైతం నాతో చర్చించారు. వీలైనంత త్వరగా అక్కడ అణు విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పరిశ్రమపై చాలా అపోహలు ఉన్నా.. వాటిని నివృత్తి చేసి అవసరమైతే చిన్న చిన్న ప్లాంట్లు సైతం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- శాసనసభలో సీఎం చంద్రబాబు స్పందన ఇది

రణస్థలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి):

రణస్థలం మండలం కొవ్వాడలో అణువిద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై మళ్లీ కదలిక వచ్చింది. ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని మూడు దశాబ్దాల కిందటే అధికార యంత్రాంగం ప్రకటించింది. ఈ క్రమంలో ఎన్నో పోరాటాలు.. ఆటంకాలు ఎదురుకాగా, అవి కొలిక్కి (మిగతా 6వ పేజీలో..)

సమస్యలు పరిష్కరించండి..

నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, యూత్‌ప్యాకేజీ అందజేయడంతో పాటు సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) కొవ్వాడ పంచాయతీ పరిధిలోని కొవ్వాడ, చిన్నకొవ్వాడ, టెక్కలి, గూడెం, రామచంద్రాపురాన్ని నిర్వాసిత గ్రామాలుగా ప్రకటించింది. అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం వీటి పరిధిలో 2,079 ఎకరాల భూమిని సేకరించారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఎన్‌పీసీ ఐఎల్ వారే స్వయంగా ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. అందుకు అనేక ప్రాంతాలను పరిశీలించారు. తీవ్ర తర్జనభర్జనల నడుమ చివరకు ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో నిర్వాసిత కాలనీ ఏర్పాటుకు నిర్ణయించారు. 190 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. 2013 భూసేకరణ చట్టానికి అనుగుణంగా పరిహారాన్ని చెల్లించారు. అయితే పరిహారం చెల్లింపుల్లో కొంత మొత్తం పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. అటు పరిశ్రమ ఏర్పాటుకాక.. ఇటు భూములపై హక్కులు లేక.. మరోవైపు పునరావాస గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం.. మౌలిక వసతులు లేక నిర్వాసితులు గందరగోళంలో ఉన్నారు. వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపి ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పిలుపు
- పలాసలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'



పలాసలో వీధులు శుభ్రం చేస్తున్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష, ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణరావు తదితరులు

పలాస, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. శనివారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో జీడిపండు జంక్షన్ వద్ద స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. 'పరిశుభ్రతే.. ఆరోగ్యానికి శ్రీరామరక్ష. సీఎం చంద్రబాబు ఎంతో బాధ్యతతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'ను బాధ్యతగా నిర్వర్తించాలి. అధికారులు ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం కోసం కేటాయించాలి. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి లక్ష్యాలు సాధించాలి' అని తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో ప్రమాణం చేయించారు.

పలాసను అభివృద్ధి చేస్తాం..

'పలాసను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తీవ్ర కృషి చేస్తున్నాం. కేంద్రీయ విద్యాలయం మంజూరు చేశాం. దీనికి సంబంధించి త్వరలో విధానాలు ప్రకటిస్తాం. కలగా మిగిలిపోయిన కాశీబుగ్గ ఫ్లైఓవర్‌కు రూ.48కోట్లు రైల్వే నిధులు తీసుకువచ్చాం. పూండి రహదారికి రూ.125కోట్లు మేర కేంద్ర నిధులు మంజూరయ్యాయి. మునిసిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. ఉద్దానం రక్షితనీటి పథకాన్ని దీనికి అనుసంధానిస్తాం. పలాస నియోజకవర్గంలోనే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు నాతో పాటు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష సంకల్పంతో దీన్ని పలాసలో నిర్మించాలని ప్రతిపాదించాం. ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెంది.. ఉద్యోగావకాశాలు లభిస్తాయి' అని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి నిర్వీర్యం: మంత్రి అచ్చెన్నాయుడు..

వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 'కేంద్రం ఇచ్చిన నిధులు కూడా రాష్ట్రప్రభుత్వమే వినియోగించి స్థానిక సంస్థలకు నిధులు కేటాయించలేదు. ప్రజలు పన్నులు కట్టే నిధులన్నీ స్థానిక సంస్థలకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల అభివృద్ధి వేగవంతమవుతుంది. రెండేళ్లలో ఆఫ్‌షోర్ పూర్తిచేస్తాం. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వంశం మాది. అందుకే 40 ఏళ్లగా ప్రజలు మమ్మల్ని గెలిపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జిల్లాను అభివృద్ధిపథంలో తీసుకువెళ్లడానికి కృషి చేస్తా'మని అచ్చెన్న తెలిపారు.



ప్రమాణం చేస్తున్న ప్రజలు, టీడీపీ శ్రేణులు



నరసన్నపేట కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థినులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు

నరసన్నపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 75 కేంద్రాల్లో ఈ నెల 3 నుంచి పరీక్షలు జరిగాయి. ప్రథమ సంవత్సరం 22,789 మంది, ద్వితీయ సంవత్సరం 17,567 మంది విద్యార్థులకు గానూ మొత్తంగా 3,349 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. శనివారం పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు కేంద్రాల నుంచి ఉత్సాహంతో బయటకు వచ్చారు. తోటి స్నేహితులను కలుసుకున్నారు. రెండేళ్లు కలిసి చదువుకున్న స్నేహితులు దూరమవుతుండడంతో కొంతమంది నిట్టూర్పు చెందారు. సోషల్ వెల్ఫేర్ కళాశాలలో చదివే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. జిల్లాలో దుప్పలవలస, తామరాపల్లి, ఎచ్చెర్ల, నందిగాం, కంచిలి తదితర ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ ప్రభుత్వమే ఇవ్వాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే కొంతమంది విద్యార్థులు ఇంజనీరింగ్, వైద్యవృత్తిలో ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని నిర్ణయించారు. కామర్స్ విద్యార్థులు సీఏ ఫౌండేషన్ కోర్సు పరీక్షలను సిద్ధమవుతున్నారు.

కిడ్నీ బాధితులకు మరిన్ని సేవలు

- ఐదు డయాలసిస్ యూనిట్లు ప్రారంభం
- గ్లో సంస్థ చొరవతో ఎన్ఆర్ఐ, ఐఓసీ, కలెక్టర్ నిధులు
- ఎంతమంది వైద్యులకైనా అవకాశం కల్పిస్తాం: మంత్రి అచ్చెన్న

పలాస, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పద్మనాభపురం కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రిలో శనివారం కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఐదు డయాలసిస్ యూనిట్లు ప్రారంభించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'పలాస కిడ్నీ ఆసుపత్రికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వేలమంది కిడ్నీ రోగులకు ఇక్కడ చికిత్స అందించాల్సి ఉంది. ఆసుపత్రిలో నెఫ్రాలజిస్టులు ఒక్కరే ఉన్నారు. ఎంతమంది పనిచేయాలనుకున్నా వారందరికి ప్రభుత్వంతో మాట్లాడి ఇక్కడ (మిగతా 6వ పేజీలో..)



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు

చెరువు పనులకు శ్రీకారం

- 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండా'గా కార్యక్రమానికి స్పందన
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పాదలు, తుమ్మచెట్ల తొలగింపు

6లో



శక్తి పెట్రోలింగ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మహిళా పోలీసులు

మహిళల రక్షణకే 'శక్తి'

- ఎస్పీ మహేశ్వరరెడ్డి
- పెట్రోలింగ్ వాహనాలు ప్రారంభం

7లో

ఇంటర్ రూపు మారుతోంది

6లో

ఇంటర్ రూపు మారుతోంది!

- 2025-26 విద్యా సంవత్సరం నుంచే...
- ఏప్రిల్ 1 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు
- 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు
- జేఈఈ, ఎంసెట్‌కు శిక్షణపైనా దృష్టి



నరసన్నపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ విద్యలో మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి ప్రభుత్వం ఈ మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటి వరకూ ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత సెలవులు ఇస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నారు. సెలవుల్లో ప్రైవేటు కళాశాలలు మాత్రం ప్రవేశాలు, తరగతులు నిర్వహిస్తుండేవి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. ప్రైవేటు విద్యార్థులతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. దీనిని అధిగమించడానికి ఈసారి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నారు. ఈ నెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు ఉన్నందున వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ తరగతులు మొదలు పెట్టనున్నారు. ఏప్రిల్ 7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నారు. పదో తరగతి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23 వరకు తరగతులు, ప్రవేశాలు నిర్వహిస్తారు. అదే నెల 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు ప్రకటించారు. మళ్లీ జూన్ 2 నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభమవుతాయి. దీనివల్ల ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు నిర్వహించే తరగతుల్లో 15శాతం సిలబస్ పూర్తి చేస్తారు. మొత్తం సిలబస్‌ను కూడా డిసెంబరు 31వ తేదీ కంటే ముందే పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అదే విధంగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న సైన్స్ గ్రూపు విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌లకు శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి... 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్‌లకు సంబంధించిన శిక్షణ ఇస్తారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు, 38, మోడల్ స్కూల్‌లో కళాశాలలు 13, కస్తూరిబాయి జూనియర్ కళాశాలలు 25, సాంఘిక, గిరిజన సంక్షేమ కళాశాలలు 10 ఉన్నాయి. వీటితో పాటు ప్లస్-1 కళాశాలలు 6, మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల కళాశాల -1 కలిపి మొత్తం 93 కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఏటా 9 వేల మంది వరకు చేరుతుంటారు. వచ్చే నెల నుంచే ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధ్యాపకులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రవేశాల అనంతరం టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కొనసాగించి.. ఫెయిలైన వారిని తొలగిస్తారు.



కళింగపట్నంలోని మదీనా బాబా సమాధి

రేపు మదీనాబాబా చందనోత్సవం

గార, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే కళింగపట్నంలోని మదీనా దర్గాలో ఈ నెల 17న చందనోత్సవం (ఉర్సు) నిర్వహించనున్నట్లు దర్గా వల్లీ ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఏటా రంజాన్ మాసంలో 16వ రోజున ఇక్కడ చందనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది 17వ తేదీన (సోమవారం) ఈ ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా 16వ తేదీన (ఆదివారం) అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 17న ఉదయం బాబా సమాధిపై కొత్త చందన లేపనం పూస్తారు. తెల్లని వస్త్రం బాబా సమాధిపై కప్పుతారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం బాబా వారి అంగరఖాస్‌ను ఊరేగించి... సమాధిపై కప్పుతారు. రాత్రి ఖవాలీ, ఖురాన్ పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మొక్కలు నాటి.. పరిరక్షించాలి: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి.. వాటిని పరిరక్షించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడడం ద్వారా మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో మధుసూధనరావు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. పాతపట్నంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఆలాంధ్ర కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించి స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పార్టీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

కిడ్నీ బాధితులకు మరిన్ని సేవలు

(ఐదో పేజీ తరువాయి)

ఉద్యోగావకాశాలు కల్పిస్తా'మని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశించారు.

● ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 16 డయాలసిస్ యూనిట్లు ఉండగా.. కిడ్నీ బాధితులకు సేవలందించేందుకు అవి చాలడం లేదు. దీంతో చాలామంది విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దీన్ని గుర్తించిన పలాస ఎమ్మెల్యే శిరీష.. గౌతులచ్చన్న బలహీనవర్గాల సంస్థ(గ్లో) సంస్థ ద్వారా మరో పది యూనిట్ల ఏర్పాటుకు కృషి చేశారు. 'ఆంధ్రా మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడిన వైద్యబృందం రెండు యూనిట్లు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నిధులతో మూడు యూనిట్లు, ఇండియన్ ఆయల్ కంపెనీ నిర్వాహకుల నుంచి ఐదు యూనిట్లు మంజూరయ్యాయి. అందులో ఐదు యూనిట్లు ఆస్పత్రికి చేరుకున్నాయి. మరో ఐదు డయాలసిస్ యూనిట్లు రానున్నాయ'ని గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ వెంకన్న చౌదరి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక యంత్రాలు తీసుకువచ్చి కిడ్నీ బాధితులకు వ్యాధి నయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోగులకు అందిస్తున్న సేవలు, కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితిని వైద్యులు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ, ఐటీసీ ఈడీ సుధాకరరావు, ఎంఎసీఏఎంప ప్రతినిధులు, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్, డాక్టర్ నవీన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువు పనులకు శ్రీకారం

- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమానికి స్పందన
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పొదలు, తుమ్మచెట్ల తొలగింపు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం వేదికగా మారింది. నగరంలోని 31వ డివిజన్‌లో జనవరి 29న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ల ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయి నగర్ వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న చెరువు సమస్యను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై కేంద్ర మంత్రి అక్కడికక్కడే స్పందించారు. చెరువు పనులు చేపట్టి కాలనీ వాసులకు వాకింగ్ ట్రాక్, దోబీ ఘాట్ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.ప్రసాదరావు, 31వ డివిజన్ ఇన్‌చార్జి విభూది సూరిబాబుల ఆధ్వర్యంలో శనివారం చెరువుతో పాటు, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు వంద మందితో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లను జేసీబీలతో కమిషనర్ తొలగించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్వయంగా తుమ్మచెట్లు తొలగించి, పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్నాం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తాను 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సాక్షిగా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. దీనిలో భాగంగా సాయినగర్ కాలనీలోని చెరువును శుభ్ర పరుస్తున్నామని చెప్పారు. త్వరలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు దోబీఘాట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మొక్కలు నాటి ఆహ్లాద కరమైన వాతావరణాన్ని కల్పిస్తామని చెప్పారు.

● అమృత్ పథకంతో తాగునీరు..

నగర పాలక సంస్థ పరిధిలో విలీనమైన పంచాయితీలకు అమృత్ 2.0 పథకంలో భాగంగా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈ నెల 12న పెద్దపాడు, కళ్లేపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్యలను 'ఆంధ్రజ్యోతి' ప్రచురించడంతో వాటిని పరిశీ లించామన్నారు. 10 వేల కొళాయి కనెక్షన్లను విలీన పంచాయితీలకు అందిస్తామన్నారు. పెద్దపాడులో 100 కేఎల్ ట్యాంక్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డా.సుధీర్ కుమార్, టీడీపీ 31వ డివిజన్ ఇన్‌చార్జి విభూది సూరిబాబు, నాయకులు రెడ్డి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, నవీన్, బాబా పాల్గొన్నారు.



పరిశుభ్రత పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కమిషనర్ ప్రసాదరావు తదితరులు

మళ్లీ.. 'అణు' కదలిక!

(ఐదో పేజీ తరువాయి)

వచ్చినా.. ఇంతవరకూ ఏర్పాటు చేయలేకపోయింది. 1991లో కొవ్వాడ పరిసర ప్రాంతాల్లో అణువిద్యుత్ పరిశ్రమ ఏర్పాటు చే యాలని ప్రతిపాదించారు. దీనిని మొదట్లో మత్స్యకారులు, ప్రజా సంఘాలు, పర్యావరణ వేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. వారు వ్యతిరేకించినా.. ఎట్టి పరిస్థితుల్లో అణువిద్యుత్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పడంతో వెనక్కితగ్గారు. ప్రజల్లో ఉన్న భయాందోళనలు, అపోహలు నివృత్తి చేసి ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో మత్స్యకారులు భూసేకరణకు అంగీ కరించారు. రూ. లక్ష కోట్లతో 1,208 మెగా వాట్ల సామర్థ్యంతో 6 రియాక్టర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. భూసేకరణతో పాటు పరిహారం చెల్లించారు. కానీ పరిశ్రమ ఏర్పాటు విషయంలో తాత్సారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ అణు విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుపై కదలిక వచ్చింది. అప్పట్లో రాజ్యసభలో వైసీపీకి చెందిన విజయసాయిరెడ్డి అణువిద్యుత్ పరిశ్రమ ఏర్పాటుచేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. దీనిపై అప్పటి మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ స్పందిస్తూ.. అమెరికా సహకారంతో తప్పకుండా ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. కానీ ఆ తరువాత ఎటువంటి కదలిక లేదు. తాజాగా దీనిపై అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రస్తావించడంతో మళ్లీ కదలిక వచ్చింది. అణువిద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కూడా సుముఖంగా ఉన్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించడంతో త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది.

యూత్ ప్యాకేజీ అందించాలి

యూత్‌ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2017 నాటికి 18 ఏళ్ల పూర్తికాని చాలా మందికి యూత్‌ప్యాకేజీ అందలేదు. వారందరికీ చెల్లించాలి. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపడం అభినంద నీయం.

-పోలీస్, మత్స్యకార నాయకుడు, కొవ్వాడ

సమస్యలు విన్నవించాం

ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ అప్పల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే ఈశ్వర రావు దృష్టికి మా సమస్యలు తీసుకెళ్లాం. నిర్వాసితులందరికీ కాలనీ నిర్మించాలని కోరాం. కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాం.

-అప్పారావు, మత్స్యకార నాయకుడు, కొవ్వాడ



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు




పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

మహిళల రక్షణకే 'శక్తి'

- ఎస్పీ మహేశ్వరరెడ్డి
- పెట్రోలింగ్ వాహనాలు ప్రారంభం


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళంక్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకే శక్తి బృందాలు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి బృందాలకు కేటాయించిన 15 పెట్రోలింగ్ వాహనాలను శనివారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శక్తి యాప్‌ను రూపొందించిందన్నారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో ప్రతీ మహిళ, చిన్నారులు డౌన్‌లోడ్ చేసుకుని తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకుని తమకు సంబంధించిన రెండు ఫోన్ నెంబర్లను లింక్ చేసుకోవాలన్నారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్‌లో ఉన్న ఎస్ఓఎస్ ద్వారా కంట్రోల్ రూమ్‌కి సమాచారం వెళ్తుందని, 10నిమిషాల్లో శక్తి బృందాలు చేరుకుని రక్షణ కల్పిస్తాయన్నారు. జిల్లాలో ఐదు బృందాలు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, సీఐలు కె.పైడపునాయుడు, పి.ఈశ్వరరావు, ఎం.అవతారం, ప్రసాదరావు, సత్యనారాయణ, త్రినేత్రి, ఆర్ఐ నర్సింగరావు, మహిళ ఎస్ఐలు ప్రవల్లిక, హైమావతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంపై అవగాహన సదస్సు

శ్రీకాకుళం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో ఉద్యోగావకాశాలపై రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో ప్రకార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ ఛైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరై ఇంటర్, డిగ్రీ పూర్తైన విద్యార్థులకు ఆరోగ్య రంగంలో ఉపాధి శిక్షణపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ ఏడాది శిక్షణలో ఒక నెల ప్రాథమిక శిక్షణ, 11 నెలల ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ శిక్షణలో స్టైఫండ్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు అందజేసి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జెమ్స్ ఆస్పత్రిలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 76809 45357,79950 13422 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ఏజెన్సీలకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా నాయకులు ఆర్.చిన్నారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నక్క శ్రీనివాసరావు, ధన్వంతరి, ప్రసాద్, గుజ్జల ఆదినారాయణ, రిమ్స్ ఉద్యోగులు కె.తేజ, కిరణ్, సాయి, ధర్మారావు, జ్యోతికుమారి, మౌనిక, ప్రత్యూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ నెల 16 నుంచి 17 వరకు నిర్వహించనున్న ఎఫ్ఆర్వో (ఫారెస్టు రేంజ్ అధికారి) పరీక్షల్లో 546 మంది హాజరు కానున్నారని, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 152 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు. వెంకటేశ్వర కళాశాల (ఎచ్చెర్ల), శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), కోర్ (నరసన్నపేట)లో ఎఫ్ఆర్వో పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ కార్యదర్శి శ్రీనివాసరావు, సెక్షన్ అధికారి మల్లిఖార్జునరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణ ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహనతోనే స్థిరమైన జీవనం

అరసవల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై అవగాహన తోనే స్థిరమైన జీవనం సాధ్యపడుతుందని వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయాధికారి రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం శనివారం జరిగింది. బగాది రామ్మోహనరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్, ఔషధ నియంత్రణాధికారి చంద్రరావు, తూనికలు, కొలతల శాఖ అధికారి విశ్వేశ్వరరావు, ఆహార భద్రత అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

అరసవల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులను స్వీకరించారు. అధికారులతో తక్షణమే ఫోనులో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా 14 మందికి రూ.20.70 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాల వలస, మార్చి 15 (ఆంధ్ర జ్యోతి): సమ స్యల పరిష్కా రానికే ప్రజా దర్బార్ కార్య క్రమాన్ని నిర్వ హిస్తున్నట్టు టీడీపీ లీగల్ రాష్ట్ర సెల్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. శనివారం పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సుమారు 500 అర్జీలు వివిధ సమస్యలపై స్వీకరించినట్టు ఆయన తెలిపారు. కార్య క్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, నాయకులు పల్లి సురేష్, లంక జగన్నాథంనాయుడు, బీవీ రమణమూర్తి, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మ క్షేత్రంలో సంప్రోక్షణ

గార, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రంలో మూడు రోజులు జరిగిన డోలోత్సవాలు అనంతరం శనివారం స్వామి వారికి, ఆలయ ప్రాంగణాన్ని అర్చకులు సంప్రోక్షణ (శుద్ధి) నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం అర్చక బృందం సంప్రోక్షణ చేశారు. ఆలయ ఈవో గురునాథ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చక బృందం పాల్గొన్నారు.

డాక్టర్ శశిధర్ సేవలు అభినందనీయం


మెడికల్ క్యాంపు నిర్వహించిన వైద్యులను అభినందిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగరంలో రెవెన్యూ గెస్ట్‌హౌస్ పునఃనిర్మాణం సందర్భంగా డాక్టర్ అన్నెపు శశిధర్ ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపు విజయవంతంగా సాగడంతో డాక్టర్ శశిధర్‌ను కలెక్టర్ పుండ్కర్, జేసీ, రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు. ఈ మెడికల్ క్యాంపులో వైద్యులు బరాటం సాయితేజ, పూజారి హరిబాబు, చింతాడ గోవిందరాజు, సనపల సుకన్య, కింతలి కిషోర్, బమ్మిడి ప్రభ పాల్గొన్నారు.

నైరలో పారిశుధ్య పనులు


వ్యర్థాలను తగులబెడుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నైర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు పీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులు గ్రామస్థులను ఆలోచింపజేశాయి. పాఠశాలతో పాటు గ్రామ పరిసర ప్రాంతాలను విద్యార్థులు శుభ్రపరుస్తుండడంతో కొందరు యువకులు సైతం తమవంతుగా స్వచ్ఛతలో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి

శ్రీకాకుళంక్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తనకు ప్రాణ హాని ఉందని పోలీసు భద్రత కల్పించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని నగరానికి చెందిన వరద వెంకట గోవిందరాజులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి తన సమస్య వివరించి, రక్షణ కల్పించాలని వినతిపత్రం అందించారు. నగరంలోని నాగావళి హోటల్‌లోని పెంట్ హౌస్‌లో ఉండేందుకు ఇటీవల కలెక్టర్ అనుమతులు జారీ చేశారని ఎస్పీకి వివరించారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ.. చట్టపరంగా రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ పాలనలో రెవెన్యూశాఖ కీలకం

శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో రెవెన్యూశాఖ ఎంతో కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలో అంబేడ్కర్ జంక్షన్‌లో గల రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆధునికీకరణ చేసిన రెవెన్యూ అతిథి గృహాన్ని శనివారం రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కలెక్టర్ వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరం రెండు రోజులు కొనసాగుతుందని, రెవెన్యూశాఖ కుటుంబ సభ్యులు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, తహసీల్దార్ ఎం.గణపతిరావు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీరాములు, టీవీ ఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ ప్రతిష్టాత్మకమైన రెవెన్యూశాఖలో 'నిధులు నిల్.. పనులు మాత్రం ఫుల్' అన్నట్టుగా పరిస్థితి తయారైనదన్నారు. ప్రస్తుతం ప్రతీ పనిని ఆన్‌లైన్ విధానంలో చూపడుతున్న తరుణంలో రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బందికి సాంకేతిక శిక్షణ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీఆర్ఏలు ఎన్నో ఏళ్లుగా రూ.10వేలకే వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు.


గాంధీ మందిరంలో స్కౌట్ విద్యార్థులు

గాంధీ మందిరం సందర్శన

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనం సందర్శించడం ఆనందంగా ఉందని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రజియా బేగం, నాగిరెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కౌట్స్ బృందాలు వారికి సమన్వయం చేసే స్కౌట్ అధికారులతో కలిసి శనివారం గాంధీ మందిరాన్ని సందర్శించారు. జిల్లా స్కౌట్ సమన్వయకర్తలు రాజేంద్ర ప్రసాద్, వాగ్దేవి, బుజ్జితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చినవారు సమరయోధుల స్మృతి మనలో కొలువుతీరిన మహనీయుల చరిత్రను ఒక్కొక్కరిది విద్యార్థులకు వివరించారు. దేశంలో తాము ఎక్కడా ఇంతటి గొప్ప ప్రదేశాన్ని చూడలేదని స్కౌట్ రాష్ట్ర కార్యదర్శిలు రజియా బేగం, నాగిరెడ్డి ఆనందాన్ని వ్యక్తం చేశారు


సైకిల్ యాత్రలో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ బృందం


స్వాగతం పలుకుతున్న దృశ్యం

తీరప్రాంత రక్షణకై సీఐఎస్ఎఫ్ సైకిల్‌యాత్ర

సోంపేట/కంచిలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత రక్షణలో భాగంగా అవగాహన కల్పించేందుకు సీఐఎస్ఎఫ్ బృందం సైకిల్ యాత్రం చేపట్టింది. ఈనెల 7న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించారు. గుజరాత్ రాష్ట్రం లక్‌పత్, పశ్చిమబెంగాల్ రాష్ట్రం బకాలి నుంచి రెండు బృందాలుగా సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఒక్కో బృందంలో 25మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్ బృందం ఒడిశా మీదుగా శనివారం సోంపేట చేరుకుంది. ఈ బృందానికి ఆంధ్రప్రదేశ్‌లో అడుగు పెట్టిన దగ్గర నుంచి ఘనస్వాగతం లభించింది. కమాండెంట్ ఏఎన్‌డీ హనీఫ్, డిప్యూటీ కమాండెంట్ వీకే ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ బృందం సైకిల్ యాత్ర చేపట్టింది. రెండు బృందాలు ఈ నెల 31వ తేదీలోగా కన్యాకుమరి చేరుకొనేలా ప్రణాళిక వేశారు. మొత్తం రెండు బృందాలు కలిపి 6,553 కిలోమీటర్లు సైకిల్ యాత్రం చేపట్టగా పశ్చిమబెంగాల్ బృందం 2800కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రత ముఖ్యం

గార, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు శనివారం వమరవెల్లి బాలికల గురుకులంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత గురుకుల పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు, ఈఓఆర్డీ కూర్మారావు, ప్రిన్సిపాల్ చిట్టితల్లి, ఏపీఎం వి.సుజాత, గార మాజీ సర్పంచ్ బడగల వెంకటప్పారావు, ఎంపీటీసీ శ్రీధరరెడ్డి, వమరవెల్లి మాజీ సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి: డీఈవో

గుజరాతీపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. జిల్లా మొత్తంలో పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షణలో మాస్ కాపింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

ఇచ్ఛాపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో ప్రకృతి వ్యవసాయం ఒక ఉద్యమంలా గ్రామస్థాయిలో వెళ్లాలని అగ్రికల్చర్ ఏడీఏ జగన్మోహన్‌రావు అధికారులకు సూచించారు. శనివారం మండల స్థాయిలో కేఏపీ (ఖరీఫ్ యాక్షన్ ప్లాన్)పై వ్యవసాయశాఖ, వెలుగు, ప్రవృతి వ్యవసాయం సిబ్బందితో కన్వర్జెన్సీ సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఆలయ భూమి సర్వే చేసి అప్పగించాలి

ఎచ్చెర్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూమిని సర్వే చేసి అప్పగించాలని స్థానిక కూటమి నేతలు, గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి 4.08 ఎకరాలు అప్పట్లో కేటాయించారని, ఇది క్రమేణా ఆక్రమణకు గురువుతున్నట్టు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి చదును చేస్తున్న భూమి జిరాయితీగా ఉన్నట్టు తహసీల్దార్ బి.గోపాలరావు తెలిపారు. సంతృప్తి చెందని కూటమి నేతలు తమ సమక్షంలో సర్వే చేసి అప్పగించాలని, అంతవరకు పనులు నిలుపుదల చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కూటమి నేతలు మెండ రాజారావు, మూకళ్ల భాస్కరావు, జేవీ రమణమూర్తి, కె.శ్రీధర్, ఎ.శ్రీరాములు, ఇ.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి శశిభూషణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి ఆయన కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. బాహుదా ఓపెన్ హెడ్ ఛానల్ వివరాలను కలెక్టర్ తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు శుభ్రం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మూలపేట పోర్టు భూసేకరణ పూర్తయిందని, జూలై నాటికి ఒక బెర్త్ పూర్తవుతుందని, పోర్టులటో ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయన్నారు. బహుదా నదిపై ప్రాజెక్టులు, హిరమండలం రిజర్వాయర్, తదితర పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవోలు కృష్ణమూర్తి, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, లక్ష్మణమూర్తి, సివిల్ సప్లయిస్ డీఎం వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సారా కేసులో ఒకరికి జైలు

రణస్థలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రణస్థలం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 2021 నవంబరు 23న కారులో 300 లీటర్ల సార తరలిస్తూ పట్టు బడిన వ్యక్తికి ఒక ఏడాది శిక్ష, రూ.2 లక్షల జరిమానా పడింది. ఎక్సైజ్ సీఐ లగుడు అనురాధాదేవి తెలిపిన వివరాల మేరకు.. సీతంపేట మండలం జోడిమానుగూడ గ్రామానికి చెందిన సవర సుధాకర్ సార తరలిస్తుండగా పట్టుప డ్డాడు. సుధాకర్‌పై నేరం రుజువు కావడంతో శ్రీకాకుళం ఫస్ట్‌క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయాధికారి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల శిక్ష అనుభ వించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. దీంతో శిక్ష అమలు చేసేందుకు నింది తుడ్ని అంపోలు జైలుకు తరలించారు.

గుజరాత్‌లో దోకులపాడు యువకుడి మృతి


ప్రకాశ్(ఫైల్)

వజ్రపుకొత్తూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దోకుల పాడు గ్రామానికి చెందిన వంక ప్రకాశ్ (35) గుజ రాత్‌లో గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. ప్రకా శ్ గుజరాత్‌లో మాండివేలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడు ప్రకాశ్‌కు భార్యలత ఉన్నారు. కాగా ప్రకాశ్ తండ్రి వంక కృష్ణ గత ఏడాది సెప్టెంబరులో గుండెపోటుతో మృతి చెందారు. తండ్రీకొడుకులు ఆరు నెలల వ్యవధి లో మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. దీంతో దోకుల పాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

ఇచ్ఛాపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొళిగాం రోడ్ పాయితారి గ్రామ సమీపంలో గల విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. బిహార్‌కు చెందిన రాజేష్ స్థానిక ఓ ఇటుకల పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమం లో శనివారం సాయంత్రం పని ముగించుకొని రాజేష్ అదే పరిశ్రమలో పనిచేస్తున్న మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తూ.. పాయితారి రోడ్డు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటన లో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా.. అతడితో ఉన్న మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలు..

రణస్థలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నారా యణశెట్టి రమణమ్మ(80) అగ్ని ప్రమాదంలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడడంతో రమణమ్మ కొవ్వొత్తు వెలిగించింది. ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుని గాయపడింది. చికిత్స నిమిత్తం రమణమ్మను శ్రీకా కుళం రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తర లించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి హత్య కేసు నిందితుడు మైనర్

నరసన్నపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో ఈనెల 3వ తేదీన జరిగిన వృద్ధురాలు కేవీటీ గున్నమ్మ హత్య కేసులో నిందితుడిగా భావిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకుని శనివారం జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. బాలుడి వయసు 16 ఏళ్లు ఉంటుందన్నారు. ఈ మేరకు విశాఖ జువైనల్ హోంకు తరలించినట్లు చెప్పారు.

రెండు ఇళ్లలో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ


పలాస, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. స్థానిక శివాజీనగర్‌లో నివాసం ఉంటున్న పాడి చంద్రశేఖర్ పాతపట్నంలో ఓ వివాహానికి వెళ్లి తిరిగి శనివారం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటిలో దొంగలు చొరబడి రూ.50వేల నగదు, 11 గ్రాము ల బంగారు, 14 తులాల వెండి ఆభరణాలు దొంగి లించారని బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మారుతీనగర్‌లో నివాస ముంటున్న చంద్రశేఖర్ అనే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఇంటిలో దొంగలు చొరబడి రూ.10వేల నగదు, అర కిలో వెండి ఆభరణాలు చోరీకి చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈయన అమ్మవారి సంబరం కోసం నందిగాం మండలం జడ్యాడ గ్రామం వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోగా ఇల్లు చిందరవందరగా ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా మారుతీనగర్‌కు చెందిన కె.కాళిదాస్ ఇంటిలో దొంగలు చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. మారుతీనగర్‌లో జరిగిన దొంగతనానికి సం బంధించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వేకువజాము మూడు గంటల ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్నట్లు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డ య్యాయి. ఈ మేరకు రెండు కేసులకు సంబంధించి బాధితుల ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నందిగాం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): లట్టిగాం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయా లయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టెక్కలి మండలం మండలం కొండభీంపురానికి చెందిన బొమ్మాళి పోలయ్య ద్విచక్రవాహనంపై పని నిమిత్తం పలాస వెళ్తున్నాడు. లట్టిగాం సమీపంలో ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో పోలయ్యకు గాయాల య్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసప మామిడి తోటల్లోనే ఇంకా..

● ఏనుగుల సంచారంతో ప్రజల్లో ఆందోళన


నీలగిరి, మామిడి తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వంశధార నది పరీవాహక ప్రాంత మైన వసప గ్రామం వద్ద ఏనుగులు తిష్ట వేయడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత నాలు గు రోజులుగా నాలుగు ఏనుగులు ఇదే ప్రదేశంలో ఉన్నాయి. దీంతో రైతులు పొలాలకు వెళ్లలేక పోతు న్నారు. వేలాది రూపాయల వ్యయంతో పుచ్చకాయ, జొన్న, అరటి పంటలను పండించగా ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆవే దనకు గురవుతున్నారు. వసప గ్రామానికి చెందిన వి.ఆఫీసురావు, బత్తిలి లక్ష్మీనారాయణలకు చెందిన పంపు సెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. శుక్రవారం రాత్రి నీరు తాగేందుకు నదిలోకి వచ్చిన ఏనుగులు తిరిగి తోటల్లోకి వెళ్లి అక్కడే ఉండడంతో ఇప్పటి లో ఈ ఏనుగులు ఇక్కడి నుంచి కదిలే అవకాశం లేదని గుర్తించి ఫారెస్ట్ అధికారులు ఏనుగులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా పహారా కాస్తున్నారు. ఉన్నతా ధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టణాభివృద్ధికి సహకారం


అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పట్టణాభివృద్ధికి సహకారం అందిస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎంపీల్యాడ్ నిధులు రూ.58.40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. కొత్తగా మూడు బస్సులను కేటాయించారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలి: ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష మంత్రులు, అధికారులను కోరారు. శనివారం జీడి పండు జంక్షన్ వద్ద నిర్వ హించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్య క్రమంలో ఆమె స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తు న్నామని, ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ఇన్‌చార్జి అధికారి శశిభూషణరావు మాట్లాడుతూ.. నెలలో ప్రతి శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధాంధ్రగా చేయ సంకల్పించామని, దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. మార్కెట్‌కు వెళ్లినప్పుడు గుడ్డ సంచులను తీసుకువెళ్లాలని కోరారు. ఈ దిశలో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బళ్ల గిరి బాబు, జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, మునిసిఎల్ కమిష నర్ ఎన్.రామారావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వినూత్నంగా స్వాగతం



కేంద్రమంత్రి కింజరాపు రామ్మో హన్‌నాయుడుకు పలాస-కాశీ బుగ్గలో వినూత్నం గా స్వాగతం పలికారు. ఆయన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కావ డంతో డ్వాక్రా మహిళలు విమానం ముగ్గు వేసి గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. ఆయన వేదికపైకి ఎక్కే ముందు విమానం ముగ్గును చూసి మహిళలను ప్రశంసించారు. అలాగే పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న కమిషనర్ రామారావును కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నా యుడు అభినందించారు. జిల్లాలో ఏ మునిసిపాలిటీలో చేయని విధంగా పారి శుధ్య పనులు చేపట్టడం, వేకుమ జామున విజిట్ చేసి ప్రజలను భాగస్వాము లను చేస్తున్నారని కొనియాడారు.

పీసీఎంఏ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కాశీబుగ్గ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పలాస క్యాష్యూ మాన్యుఫేక్చరింగ్ అసోసియేషన్ (పీసీఎంఏ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకా రం శనివారం స్థానికంగా జరిగింది. ఈ సందర్భం గా కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని అభినందించారు. జీడి పప్పు పరిశ్రమల అభివృద్ధికి తమవంతు సహక రిస్తామని పేర్కొన్నారు. పీసీఎంఏ నూతన అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా టంకాల రవిశంకర్‌గుప్తా, కోశాధికారిగా మల్లా సంతోష్‌కుమార్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జీడి వ్యాపా రులు శాసనపురి మురళీకృష్ణ, బెల్లాల నారాయణరావు, మల్లా భాస్కరరావు, తర్లాన రమేష్, మహేష్, సతీష్, మన్మథరావు, నాగేశ్వ రరావు, కామేశ్వరరావు, ఆకాష్, శ్రీనివాస్, నర్సయ్య, డోకి రామారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు ప్రకటనపై హర్షం


ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఐటీ డీఏ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే గోవిందరావుకు గిరిజనులు రుణపడి ఉంటారని టీడీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం కార్య నిర్వహణ కార్యదర్శి బైరసింగి దినకర్‌రావు అన్నారు. శనివారం బందపల్లిలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైసీపీ ప్రభుత్వం గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా జిల్లాలో ఐటీ డీఏ లేకుండా చేసిందని విమర్శించారు. ప్రభుత్వం వచ్చి ఏడాది గడవకముందే మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుకు మంత్రి అసెంబ్లీలో ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జన్ని కృష్ణారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు: ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎ ద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. శ్రీముఖలింగం తాగునీటి పథకం ద్వారా శివారు ప్రాంతాలకు తాగునీరందడం లేదన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ మా ర్గాలు సిద్ధం చేశామని, ప్రతి గ్రామానికి బోర్లు పనిచేసేలా చర్య లు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి రాజకీయాలకు అ తీతంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతి నిధి మెండ రాంబాబు, ఎంపీడీవో అప్పలనాయుడు, బగ్గు గోవిం దరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి బాటలు

నరసన్నపేట, మార్చి15(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ప్రభు త్వం బాటలు వేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.8 లక్షల నిధు లుతో చేపడుతున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ప్రారంభిం చారు. కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మాజీ సర్పంచ్ చిట్టిబాబు, ఉపసర్పంచ్ సానుపల్లి కృష్ణబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లత, ఎంపీడీవో మధుసూ దనరావు, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు రుత్విక్



నరసన్నపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అం తర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్(ఐపీటీ-2025)నిర్వహించిన రెండు స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనపరిచి ఆసియా ఫిజిక్స్ ఒలింపియా డ్‌కు దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో ఆసియా ఖండంలో ఉన్న 23 దేశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు జాతీ యస్థాయిలో 20 మందిని ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల నుంచి రుత్విక్ ఒక్కరే ఎంపికయ్యాడు. మే 4 నుంచి 12 వరకు అబుదాబీలో ఆసియా ఫిజిక్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్గొను న్నాడు. రుత్విక్ ప్రస్తుతం విజయవాడలో ఇంటర్ ద్వితీయ సంవ త్సరం పరీక్షలు రాసి జేఈఈ అడ్వాన్స్‌కు సిద్ధం అవుతున్నాడు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి అచ్చెన్నాయుడు


టెక్కలిలో వినతులు స్వీకరిస్తున్న అచ్చెన్న

కోటబొమ్మాళి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను పరిష్కరించ డమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యా లయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజ ల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. పంటల సాగుకు సాగునీటి కోసం విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని పలువురు రైతులు కోరారు. విద్యుత్‌శాఖాధికారులతో మా ట్లాడి కనెక్షన్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండ లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్‌తో మృతిచెందిన లైన్‌మన్ కుటుంబానికి సాయం

టెక్కలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో వీధిలైట్లు బాగుచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి బ్రెయిన్‌డెడ్ అయి ఇటీవల మృతి చెందిన లైన్‌మన్ బాలరాజు కుటుంబానికి శనివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తక్షణ సాయం కింద రూ.50వేలను ఆయన భార్య ధనలక్ష్మికి అందించారు. స్థానిక టీడీపీ కార్యా లయంలో ప్రజాదర్బార్ నిర్వహించి కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని కొందరు, సీసీ రోడ్ల పనుల బిల్లులు చెల్లించాలని మరికొందరు ఆయనను కోరారు. పలు సమస్యలపై మంత్రికి ఇచ్చిన వినతులపై తక్షణం ఆయన సంబంధిత అధికా రులతో మాట్లాడి ఆదేశించారు. పార్టీ కోసం కష్టబడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు. సమావేశంలో తహ సీల్దార్ రవికుమార్, డీఈఈ సుధాకర్, టీడీపీ నాయకులు బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్, ఎల్ఎల్‌నాయుడు, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, కామేసు పాల్గొన్నారు.

పెద్దసానలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

టెక్కలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్ కావాలని కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యా యుడు ఎలుగు ప్రసాద్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని పేర్కొంటూ కొం దరు విద్యార్థినులు ఫిర్యాదు చేసిన సంగతి తెలి సిందే. ఈ నేపథ్యంలో డీఈవో విచారణ చేపట్టి సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశా రు. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాల వద్ద పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తు న చేరుకుని ఆ ఉపాధ్యాయుడిని తిరిగి నియ మించాలని కోరారు. హెచ్ఎం నేతాజీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీనిపై ఎంఈ వో డి.తులసీరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా గురువారం విద్యార్థులు ఇచ్చిన లేఖను డీఈవో దృష్టిలో పెట్టామని, ఆ ఉపాధ్యాయుడి గతాన్ని పరిశీలించి డీఈవో సస్పెండ్ చేశారని, ఈ విషయమై లోతుగా దర్యాప్తు చేపడితే వాస్త వాలు బయటకు వస్తాయన్నారు.

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం


పింఛన్‌పై ఆరా తీస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామా లను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉండ వచ్చని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా రావివలస, దామోదర పురం గ్రామాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేస్తు న్న రేషన్ సరుకులు అందుతున్నాయా, లేదా అని వివరాలు సేకరించారు. గ్రామంలో పలువు రు వృద్ధులను కలిసి ప్రభుత్వం అందిస్తున్న పిం ఛన్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ సింహాద్రి, ఏపీవో ప్రసా ద్, బడే జగ దీష్, ఇప్పిలి జగదీష్ తదితరులు పాల్గొన్నారు. ● ప్లాస్టిక్ రహిత టెక్కలిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తి అన్నారు. శనివారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాల యం నుంచి అంబేద్కర్ కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేష గిరిరావు, ఎంపీడీవో లక్ష్మీబాయి పాల్గొన్నారు.

దత్తత గ్రామాల్లో 'నవోదయం 2.0'

టెక్కలి/మెళియాపుట్టి, మార్చి 15(ఆంధ్ర జ్యోతి): సారా విక్రయించే గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో నవోదయం 2.0పై అవగా హన కలిగించాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిష నర్ పైడి రామచంద్రరావు అన్నారు. శనివా రం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెళి యాపుట్టి మండలం నేల బొంతు గ్రామంలో నవోదయం 2.0లో గిరి జనులకు అవగాహన కలిగించారు. సారా తయారీ, రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్వీ రమణ, ఝాన్సీ, ఎస్ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సీఎంఆర్ జ్యువెలరీ షోరూం ప్రారంభం


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి మీనాక్షి చౌదరి


అధినేత ఎంవీఆర్, హారికతో కలిసి బంగారు ఆభరణాలను చూపిస్తున్న మీనాక్షి

రాజాం/రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజాం-పాలకొండ రోడ్డులో సినీనటి మీనాక్షి చౌదరి శనివారం సీఎంఆర్ జ్యువెలరీ షోరూమ్‌ను ఆ సంస్థ అధినేత మావూరి వెంకట రమణతో కలిసి ప్రారంభించారు. రెండంతస్తుల షోరూమ్‌లో వెంకటరమణ కోడలు హారికతో కలిసి కలియ తిరిగారు. బంగారు ఆభరణాల వివరాలను మీనాక్షి చౌదరి అడిగి తెలుసుకు న్నారు. అనంతరం షోరూము బయట ఏర్పాటుచేసిన వేదిక పైనుంచి చేయి ఊపుతూ కార్యక్ర మానికి హాజరైన వారిని ఉద్దేశించి.. హలో రాజాం.. ఎలాఉన్నారు.. బాగు న్నారా.. అని మీనాక్షి పలకరించారు. వందలాది మంది ఆమెను చూసేం దుకు తరలివచ్చారు. ఈ సంద ర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడు తూ తెలుగు మహిళల జీవితాలు బంగారు ఆభరణాలతోనే ముడిపడి ఉంటాయని తెలిపారు. రాజాంలో ప్రారంభించిన ఈ షోరూం 18వది అని వెంకట రమణ తెలిపారు. కాగా పట్టణానికి చెందిన వైద్యుడు గ్రంధి ప్రకాశరావు ప్రథమ కొనుగోలుదారుగా ఆభరణాలు కొనుగోలు చేశారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ కూడా ప్రారంభోత్సవానికి హాజరయారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖు లు చెలికాని జగన్నాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సౌభాగ్యలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ

టెక్కలి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు బ్రాహ్మణవీధిలో నూతనంగా నిర్మించిన సౌభాగ్యలక్ష్మి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మేళ తాళాలు, వేదమం త్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ జరి గింది. అర్చకులు యంత్ర, శిఖర ప్రతిష్ఠ చేయించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

జీడి రైతుల సమస్యలను పరిష్కరించండి

పలాసరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జీడి రైతుల సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని జీడి రైతాంగ సమ స్యల సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం పలా స వచ్చిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతి పత్రం అందించారు. జీడిపిక్కల కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 80 కేజీల జీడి బస్తాను రూ.16 వేలకు కొనుగోలు చేయాలని, జీడి, కొబ్బరి బోర్డును పలాస లో ఏర్పాటు చేయాలని, మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం అంద జేసిన వారిలో సంఘం ప్రతినిధులు మామిడి మాధ వరావు, కార్యదర్శి గోర్లు చలపతి తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరణ

సంతబొమ్మాళి, మార్చి 15(ఆంధ్ర జ్యోతి): అధికారులు వ్యవహరిస్తున్న తీరు కు నిరసనగా మండల సర్వసభ్య సమావే శాన్ని సభ్యులు శనివారం బహిష్కరిం చారు. ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్య క్షతన మండల సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. అయితే కోరం లేకపోవడంతో రెండు గంటల ఆల స్యంగా సమావేశం ప్రారంభమైంది. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ప్రభు త్వం ఏర్పడినప్పటి నుంచి పంచాయతీల్లో అభి వృద్ధి పను లకు అంచనాలు తయారు చేయలేదన్నారు. ఎంపీటీసీలకు గౌరవ వేత నం చెల్లించేందుకు కూడా అధికారులు ఇ బ్బందులు పెడుతున్నారన్నారు. అందువల్ల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు సభ్యులు తీర్మానించారు. ఈ తీర్మాన కాపీని ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్‌కు ఎంపీ పీతో పాటు జడ్పీటీసీ వసంతరెడ్డి, వైస్ ఎంపీపీ చింతామణి అందజేశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పాతపట్నం మార్చి15(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత ఉన్నందున వడదెబ్బకు గురికా కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యా లయ ప్రాంగ ణంలో చలివేంద్రాన్ని శనివారం ప్రారం భించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు.

పుట్టినరోజు వేడుకకు వెళ్తూ..

(ఐదో పేజీ తరువాయి)

మీనమ్మ, కుమారుడు లక్ష్మీపతి, అల్లుడు భాస్కరరావు, మనుమరాలు కుసుమతో కలిసి కారులో మధురవాడకు పయన మయ్యారు. సరిగ్గా లావేరు మండలం బుడుమూరు హైవే రోడ్డు వద్ద కారు టైరు పంక్చర్ అయి పేలింది. దీంతో కారు అదుపు తప్పి ముందుగా స్కూటీపై వెళ్తు న్న టి.శంకరరావును ఢీకొట్టారు. ఆతర్వాత కారు పల్టీలు కొడుతూ హైవేపై పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనతో కారు, స్కూటీ నుజ్జునుజ్జయ్యాయి. శంకర రావు అక్కడికక్కడే మృతిచెందాడు. కారు లో ఉన్న మీనమ్మ, ఆమె కుమారుడు లక్ష్మీ పతి తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మరణించారు. కారు డ్రైవింగ్ చేసిన భాస్కరరావు కొనఊపిరితో ఉండగా స్థాని కులు అక్కడకు చేరుకుని 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. భాస్కరరావును 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. ఇదే ప్రమాదంలో కాళిదాసు, మనుమరాలు కుసుమకు తీవ్రగాయాల య్యాయి. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను, క్షతగాత్రులను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం కోసం మార్చురీలో మీనమ్మ, లక్ష్మీ పతి, భాస్కరరావు, శంకరరావు మృతదేహా లను భద్రపరిచారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పెదలోగిడిలో విషాదఛాయలు..

● ప్రమాద ఘటన తెలియగానే పాత పట్నం మండలం పెదలోగిడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కళ్ల ముందరే కారులో సందడిగా మనుమడి పుట్టినరోజు వేడుకలకు బయల్దేరినవారు రెండు గంటల అనంతరం మృత్యుఒడికి చేరిపోయారన్న ప్రమాద వార్త వినడంతో బంధువులు, ఇరుగుపొరుగువారు హతాశు లయ్యారు. అక్కడ మధురవాడ నుంచి కాళిదాసు పెదకుమారుడి కుటుంబ సభ్యు లు.. ఇక్కడ పెదలోగిడిలో నివాసముం టున్న కాళిదాసు కుటుంబం, అల్లుడు భాస్కరరావు బంధువులు ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రికి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో ఉన్న కాళిదాసు, కుసుమను పరామర్శించలేక.. ఇటు మృతదేహాల వద్దకు వెళ్లలేక బంధువులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.